క్లుప్తంగా

'భగీరథ' నీరు వృథా



పైపులైన్ లీకేజీతో వృథాగా పారుతున్న తాగునీరు

తాండూరు టౌన్: పట్టణంలోని శివాజీచౌక్‌లో మంగళవారం మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఏర్పడి గంటల తరబడి తాగునీరు రోడ్డు మీద పారింది. దీంతో ఎగువ ప్రాంతంలోని వారికి తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. గంటల తరబడి నీరు వృథాగా పారుతున్నా సంబంధిత అధికారుల నుంచి స్పందన కరువైంది. లీకేజీ అయిన ప్రాంతంలో నీరు వృథాగా పారడంతో పాటుగా తాగునీరు కలుషితమైంది. అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

తిరుపతిరెడ్డికి లయన్స్‌క్లబ్ సభ్యుల ఆహ్వానం



తిరుపతిరెడ్డితో లయన్స్‌క్లబ్ సభ్యులు

కొడంగల్: కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యుడు సరాఫ్ శ్రీనివాసాచారి, రామాచారి ఏర్పాటు చేస్తున్న జ్యూవెలరీ షాపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవ్వాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు



బొంపల్లిలో పశువులకు టీకా వేస్తున్న అధికారి స్వప్న

దోమ: పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బొంపల్లి పశువైద్యసంపద అధికారి స్వప్న అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని బొంపల్లి పశువైద్య సబ్ సెంటర్‌లో కంపౌండర్ బాబయ్యతో కలసి పశువులకు గాలికుంటు వ్యాధి టీకా వేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. పశువులు జ్వరం, అనారోగ్యానికి గురవుతుంటాయని, వ్యాధి నివారణకు టీకా వేయడంతో కోలుకుంటాయని చెప్పారు. ప్రతీ ఏడాది రెండు దఫాలుగా టీకా వేయించాలని రైతులకు సూచించారు.

బాధితుడికి సాయం

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని మండల బీజేపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల మండలంలోని మీర్జాగూడ గ్రామానికి చెందిన జె.కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడిని మంగళవారం చేవెళ్లకు చెందిన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డిలు పరామర్శించారు. నాయకుడు వైభవ్‌రెడ్డి తనవంతుగా వైద్యఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు వైభవ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్లకు చెందిన పలువురు కూడా తమవంతు సహాయంగా ఆన్‌లైన్ ద్వారా బాధితుడికి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట యువకులు, తదితరులు ఉన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను సకాలంలో రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కళాశాల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరపకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కుంట కాదు.. రోడ్డే



మండల పరిధిలోని గోపాల్‌పూర్–రుద్రారం రహదారి గుంతలతో అధ్వానంగా తయారైంది. పాలకులు పట్టించుకోక వర్షాలకు నీరు నిలిచి రోడ్డు కుంటలా మారుతున్నాయి. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు బాగు చేయించాలని కోరుతున్నారు. – పెద్దేముల్



పరిగి: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు



కుల్కచర్ల: ఠాణాలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నేవీ రాడార్‌ను ఎడారికి తరలించండి

- ముందస్తు అరెస్టులు అన్యాయం
- దామగుండం పరిరక్షణ వేదిక జేఏసీ

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రజా సంఘాల నాయకులను అర్ధరాత్రి నుంచి అరెస్టు చేయడం తగదని దామగుండం పరిరక్షణ వేదిక జేఏసీ ఖండిస్తోదన్నారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున వికారాబాద్‌లో జేఏసీ నాయకులు గీత, మహేందర్, మహిపాల్, అశోక్ తదితరులను అరెస్టు చేశారు. అనంతరం గీత మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ ఒంటరి పోకడలు సరికావన్నారు. నేవీకి ప్రజలు వ్యతిరేకం కాదని దేశం కోసం అడవులను సైతం కాపాడుకోవాలనే రాడార్ స్టేషన్‌ను మరో చోటికి మార్చాలని అన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో కూల్చివేతలు చేపట్టిన ప్రభుత్వానికి దామగుండం అడవిని కాపాడే విషయంలో దేశ భవిష్యత్తు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి రాడార్ స్టేషన్‌ను ఎడారి ప్రాంతాలకు తరలించి అడవిని కాపాడాలన్నారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రులను అడ్డుకుంటాం

పూడూరు: మండల పరిధిలోని దామగుండంలో మంగళవారం నేవీ రాడార్ కేంద్రం శంకుస్థాపనకు వస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటామని బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులను చన్గోముల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి కులకచర్ల, చన్గోముల్ ఠాణాలకు తరలించారు. మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ సర్పంచ్ బుచ్చన్న, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మానిక్యం గౌడ్, జంగయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాంచందర్, సతీశ్, 30 మంది నాయకులను అరెస్ట్ చేశారు.

'కాంగ్రెస్‌ది ప్రజా వ్యతిరేక పాలన'

పరిగి: కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని.. వీరిది ప్రజా వ్యతిరేక పాలన అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పూడూర్ మండల పరిధిలోని దామగుండం నేవీ రాడార్ శంకుస్థాపన కార్యక్రమం ఉన్నందున బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలు నేవీ రాడార్‌ను వ్యతిరేకిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వలాభాల కోసమే ప్రాజెక్టును పట్టాలెక్కించారని ఆరోపించారు. నేవీ రాడార్ ఏర్పాటుతో మూసీ నదికి ముప్పు ఏర్పడుతోందన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

కుల్కచర్ల: నేవీ రాడార్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి అన్నారు. మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా శేరి రాంరెడ్డితో పాటుగా దాదాపూర్, పరిగి, పూడూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను ఆయా మండలాల పోలీసులు కుల్కచర్ల స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చటి పల్లె ప్రాంతాలను అటవిని నాశనం చేస్తున్న సర్కారుకు ప్రజలు బుద్ధిచెప్పేరోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో రాజు, రామన్న మాదిగ, సార శ్రీనివాస్, కృష్ణ గౌడ్, కాంగారి అంజనేయులు, సునంద, ముకుంద నాగేష్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రవి, కృష్ణారెడ్డి, బిచ్చయ్య, పెద్ద నర్సింలు, లక్ష్మయ్య తదితరులున్నారు.

నిరసనలకు తావులేకుండా...

కొడంగల్: దామగుండం రాడార్ స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా పోలీసులు పలువురు ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నిరసనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కొడంగల్‌కు చెందిన బీసీ సేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కన్నోజు వెంకటేశ్వర్లును మంగళవారం ఉదయం అరెస్టు చేసి కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రజా ఉద్యమం చేపడతాం

దోమ: నేవీ రాడార్ ఏర్పాటుతో వాతావరణ కాలుష్యంతో పాటుగా రేడియేషన్ సమస్యలతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పవని మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వీఎల్ఎఫ్ రాడార్ శంకుస్థాపన నేపథ్యంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేవీ రాడార్ ఏర్పాటును ఉపసంహరించుకోకుంటే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.



పూడూరు: కుల్కచర్ల ఠాణాలో బీఆర్ఎస్ పూడూరు నాయకులు



దోమ: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నేతలు

ప్రమాదాలకు 'మార్గం'

- భారీ వర్షాలతో కొట్టుకుపోయిన సీసీ
- ఊడిపోయిన రాళ్లు
- సమస్యను పరిష్కరించాలని స్థానికుల అభ్యర్థన

ధారూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆఫీసు నుంచి మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిజాం కాలంలో పైనుంచి వచ్చే వరదనీరు ఈమార్గం పైనుంచి ప్రవహిస్తుంది. లోతుగా ఉన్న రోడ్డు దెబ్బతినకుండా రాళ్లను పరిచి మధ్యలో సీసీ వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సీసీ కొట్టుకుపోయింది. రాళ్లు సైతం ఊడిపోవడంతో రహదారి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ గమనించకుండా వెళ్తే ప్రమాదం తప్పదు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ధారూరు నుంచి మండల పరిషత్, రెవెన్యూ కార్యాలాయలకు వెళ్లే దారిలో దెబ్బతిన్న రోడ్డు

సాయప్ప మరణం పార్టీకి లోటు

కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు నర్సింలు



సాయప్ప మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

పెద్దేముల్: మండల పరిధిలోని తింసాన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాయప్ప మరణం పార్టీకి తీరని లోటని తాండూరు నియోజకవర్గ ఎ–బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింలు అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సాయప్ప మంగళవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు నసీర్, పార్టీ సీనియర్ నాయకులు మైపాల్ రెడ్డి, మల్లేశం, బిచ్చప్ప, దాసరి నర్సింలు, రవి శంకర్, విద్యాసాగర్, మైపూస్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎందుకీ బస్ షెల్టర్?

- నిరుపయోగంగా మారిన వైనం
- పట్టించుకోని ఆర్టీసీ, ఆర్అండ్‌బీ అధికారులు

పరిగి: హైదారాబాద్– బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. పట్టణ కేంద్రంలోని తుంకుల్ గడ్డ సమీపంలో లక్నాపూర్ బస్ షెల్టర్ పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. తుంకుల్‌గడ్డలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, బీఈడీ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, పలు వసతి గృహాలు ఉన్నాయి. ఈ ప్రాంతం నిత్యం విద్యార్థులు, ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. కానీ లక్నాపూర్ గేట్‌కు సుమారు రెండు వందల మీటర్ల దూరంలో ఈ బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడకు ఎవరూ రావడం లేదు. జనాలు లేకపోవడంతో బస్సులు కూడా నిలపడం లేదు. ఇదిలా ఉండగా బస్ షెల్టర్‌కు ఇరువైపులా స్క్రాప్ దుకాణాలు వెలిశాయి. వీరు తమ అవసరాలకు అనుగుణంగా దీన్ని వాడుకుంటున్నారు. సేకరించిన పాత సామగ్రిని సంచుల్లో నింపి బస్ షెల్టర్ పక్కనే నిల్వ చేస్తున్నారు. పక్కనే లారీలను నిలిపి లోడ్ చేస్తున్నారు. ఈ వ్యర్థాల నుంచి దుర్వాసన వస్తోందని, అందుకే ఇక్కడ ఎవరూ నిలబడటం లేదని పలువురు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్టీసీ అధికారులు స్పందించి లక్నాపూర్ బస్ షెల్టర్ ప్రయాణికులు, ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.



జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన బస్ షెల్టర్

బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌ను బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ జాతీయ నేతలు శేఖర్‌ను రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శేఖర్ మాట్లాడుతూ.. నియామకానికి సహకారం అందించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి జెడ్పీహెచ్ఎస్ 2001– 2002 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఒక్కచోటకు చేరారు. సంగయ్య లొంక సమీపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. 22 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తుల్జాపూర్ భక్తులకు అన్నప్రసాదం

తాండూరు: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రయాణికులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. దసరా అనంతరం మహారాష్ట్రలోని తుల్జాపూర్ అంబా భవానీమాత ఆలయానికి ప్రతీ ఏటా భక్తులు పెద్దఎత్తున తరలివెళ్తుంటారు. షోలాపూర్ నుంచి తుల్జాపూర్ వరకు కాలినడకన వెళ్లి అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తాండూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి తాండూరు ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు ఆధ్వర్యంలో భక్తులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ పరిమళ్‌గుప్తా, కౌన్సిలర్ రామకృష్ణ, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు రామకృష్ణ, అశోక్, శ్రీధర్, రాజు, సందీప్‌రెడ్డి, నర్సింహ, సందీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



భక్తులకు అన్న ప్రసాదం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఆశల వేరుశనగ



స్ప్రింక్లర్ల ద్వారా వేరుశనగ విత్తనాలకు నీరందిస్తున్న రైతు



దుద్యాల్‌లో సాగు చేస్తున్న వేరుశనగ పంట

- గణనీయంగా పెరుగుతున్న పంట సాగు విస్తీర్ణం
- సమృద్ధిగా వర్షాలు కురవడంతో ఆసక్తి చూపుతున్న రైతులు

దుద్యాల్: వేరుశనగ పంట సాగు వైపు రైతులు మక్కువ చూపుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలో సరైన వానలు కురవక బోర్లలో నీటి మట్టం పెరగలేదు. దీంతో పంటలు వేయాలా.. వద్దా..? అనుకుంటున్న తరుణంలో వరుణుడు విజృంభించాడు. వానలు దంచి కొట్టడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు ఒక్కసారిగా పైకి ఉబికి వచ్చాయి. దీంతో కర్షకుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. వరి వేయాలని భావించిన వీరికి వర్షాలు సహకరించలేదు. దీంతో నారుమడులను అలాగే వదిలేశారు. సీజన్ చివరలో వర్షాలు దంచికొట్టడంతో పొలాలను చదను చేసుకుని వేరుశనగ సాగుకు మొగ్గు చూపుతున్నారు. పంట సాగు కోసం బిందు, తుంపర సేద్యాన్ని అవలంబిస్తున్నారు. ఇతర పంటల మాదిరిగా వేరుశనగకు పొలాలు సమాంతరంగా ఉండాల్సిన అవసరం లేదు. స్ప్రింక్లర్, డ్రిప్ సాయంతో ఎలాంటి చెలకలోనైనా పంట విత్తుకోవచ్చు.

1,300 ఎకరాల్లో పంట విత్తడం పూర్తి

దుద్యాల మండల పరిధిలోని హస్నాబాద్, కుదురుమల్ల, దుద్యాల్, హంసంపల్లి, లగచెర్ల, హకీంపేట్, పోలేపల్లి, ఈర్లపల్లి, చిలుముల్ మైల్వార్, చెట్టుపల్లి తండా, సంత్రకుంటతండా, సత్తర్‌కుంటతండా, అల్లిఖాన్‌పల్లి అలేడ్, సోమ్లనాయక్‌తండా, హంసంపల్లితండా, గడ్డమీదితండా తదితర గ్రామాల్లో ఈసారి వేరుశనగ సాగు గణనీయంగా పెరగనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలో గతేడాది సుమారు 1,500 ఎకరాల్లో పంట సాగు చేయగా ఈసారి 1,800 ఎకరాలు సాగవుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 1,300 ఎకరాల్లో పంట విత్తడం పూర్తయిందని చెబుతున్నారు.

సూచనలు పాటించాలి



గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంది. పంట వేసే రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. కలుపు నివారణ మందులు స్ప్రే చేస్తే దిగుబడులపై ప్రభావం చూపుతుంది.

– తులసి, ఏఓ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622